



# కరపత్రం

SINCE 2014

బుధవారం జూన్ 17, 2026 | సంపుటి : 2 | సంచిక : 245 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4




## సన్నరకం వరి విత్తనాలు సిద్ధం చేయండి

- రైతు వేదికల వద్ద అందుబాటులో ఉంచండి
- సన్నవడ్లు పండించే రైతుల డేటా సేకరించండి
- వ్యవసాయంలో కూడా ఎఐ, టెక్నాలజీ వినయోగం పెరగాలి
- వ్యవసాయ వర్సిటీ నోడల్ ఏజెన్సీగా సాంకేతిక సహకారం
- వ్యవసాయరంగంపై ఉన్నతస్థాయి సమీక్షలో సిఎం రేవంత్ సూచన



**హైదరాబాద్,జూన్16 :**
ధాన్యం దిగుబడిపైన వ్యవసాయ శాఖకు సంపూర్ణ అవగాహన ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. నిర్దేశించిన వరిరకాల విత్తనాలను రైతు వేదికలో అందుబాటులో ఉంచాలని మార్గనిర్దేశం చేశారు. సన్నవడ్లు పండించే రైతుల డేటా సేకరించాలని ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో వ్యవసాయ శాఖపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులకు పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. బోనస్ ఇచ్చే 7 రకాల సన్న వడ్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. 7 రకాల సన్న వడ్లను సబ్సిడీపైన ఇవ్వాలని మార్గనిర్దేశర చేశారు. భద్రాద్రి కొత్తగూడం దమ్మపేట మండలంలో ప్రారంభించిన పైలెట్ ప్రాజెక్ట్‌ను మరింతగా వినియోగించుకోవాలని సూచించారు.వ్యవసాయ శాఖలో సాంకేతికతను మరింతగా పెంచుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఏఐని మరింతగా వినియోగించాలని నిర్దేశిరచారు. అగ్రికల్చర్ యూనివర్సిటీని నోడల్ ఏజెన్సీగా పెట్టుకొని సాంకేతికతను పెంచుకోవాలని సూచించారు. సీడ్స్ నుంచి కొనుగోలు వరకు వ్యవసాయ శాఖ, సివిల్ సప్లయిస్, అగ్రికల్చర్ యూనివర్సిటీ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మార్క్‌ఫెడ్ నష్టాలను తగ్గించుకునే ప్రయత్నాలు చేయాలని పేర్కొన్నారు. ఆయిల్ ఫెడ్‌ను బలోపేతం చేసుకోవాలని తెలిపారు. అన్ని వ్యవసాయ మందులకు సంబంధించి ఓ యాప్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. యాప్ ద్వారా బుక్ చేసుకునే యూరియాను రైతు వేదిక ద్వారా పంపిణీ చేయాలని అన్నారు. జిల్లా అదనపు కలెక్టర్‌కు యూరియా పంపిణీ బాధ్యతను అప్పగించాలని ఆదేశించారు. యూరియా, ఇతర ఎరువుల కేటాయింపులపై ఎప్పటికప్పుడూ కేందప్రభుత్వానికి లేఖలు రాయాలని ఆదేశించారు. రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉత్పత్తి అయిన ఎరువులు మొత్తం తెలంగాణకే ఇచ్చేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

2లో..



## ట్రంప్‌తో ప్రధాని మోడీ కరచాలనం
### జి7 సదస్సులో ఆత్మీయాయ పలకరింపు

**ప్యారిస్,జూన్16 :**
ఫ్రాన్స్‌లో జరుగుతున్న జీ7 సదస్సు సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కలుసుకున్నారు. దాదాపు 16 నెలల తర్వాత ప్రత్యక్షంగా కలుసుకున్న వీరిద్దరూ ఆత్మీయంగా పలకరించుకోవడం అంతర్జాతీయ వేదికపై ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జీ7 సదస్సు ప్రాంగణంలో జరిగిన ఈ సమావేశంలో మోదీ, ట్రంప్ ఒకరితో ఒకరు కరచాలనం చేసుకుని కాసేపు మాట్లాడుకున్నారు.

మిగతాద్ది 2 లో

## చిన్న కాంట్రాక్టర్లకు
# 'ప్రజా ప్రభుత్వం' అండ

- దశలవారీగా పెండింగ్ బిల్లులు క్లియర్ చేస్తాం
- ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హామీ
- 18న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమం



**హైదరాబాద్,జూన్16 :**
రాష్ట్రంలోని చిన్న సివిల్ కాంట్రాక్టర్ల సమస్యల పట్ల ప్రజా ప్రభుత్వం అత్యంత మానవీయ కోణంలో స్పందిస్తోందని, వారికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మంగళవారం ప్రజాభవన్ లో బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు, సివిల్ కాంట్రాక్టర్లు డిప్యూటీ సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. తమకు రావాల్సిన పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని ఈ సందర్భంగా వారు విజ్ఞప్తి చేయగా, ఉపముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. చిన్న కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకునే ఆర్థిక శాఖ ప్రతినెలా నిరంతరాయంగా బిల్లులను చెల్లిస్తోందని ఈ సందర్భంగా భట్టి విక్రమార్క వారికి గుర్తుచేశారు. పెండింగ్ బకాయిల క్లియరెన్స్ కోసం ప్రభుత్వం ఒక స్పష్టమైన ప్రణాళికతో ముందుకు వెళ్తోందని ఆయన వివరించారు. రాష్ట్రంలో చిన్న కాంట్రాక్టర్లకు దశలవారీగా పెండింగ్ బిల్లులన్నింటినీ పూర్తిగా చెల్లించి చిన్న కాంట్రాక్టర్లను ఆదుకుంటామని డిప్యూటీ సీఎం భరోసా ఇచ్చారు. అంతకుముందు మధ్యాహ్నం కాంట్రాక్టర్ల ప్రతినిధులు రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో చర్చలు జరిపారు. అనంతరం ప్రజాభవన్‌కు చేరుకుని, మంత్రి కోమటిరెడ్డితో జరిగిన చర్చల సారాంశాన్ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వివరించారు. పెండింగ్ బిల్లుల చెల్లింపులపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇచ్చిన సానుకూల హామీతో తాము ఎంతో సంతృప్తి చెందామని, ఈ నెల 18న చేపట్టదలచిన 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని వాయిదా వేసుకుంటున్నట్లు బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర చైర్మన్ రవీందర్ రెడ్డి ప్రకటించారు. తమ సమస్యల పరిష్కారానికి సానుకూలంగా అండగా నిలిచిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఆర్అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిలకు అసోసియేషన్ తరఫున ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షులు వి. సత్యమూర్తి, మాజీ జాతీయ అధ్యక్షులు ఎస్.ఎన్. రెడ్డి, మాజీ ఉపాధ్యక్షులు డి.వి.ఎన్. రెడ్డి, సుగుణాకర్ రావు, భాస్కర్ రెడ్డి, సంతోష్ రెడ్డి, ప్రభాకర్, శ్యామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




2లో..

## అవినీతి అనకొండ నరహరి

- భారీగా ఆస్తులు గుర్తించిన ఎసిబి
- ఇంట్లో రూ. 1.54కోట్ల నగదు స్వాధీనం

**హైదరాబాద్,జూన్16 :**
ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరిని ఏసీబీ అరెస్ట్ చేసింది. నరహరి ఇంటితో పాటు మరో 9 చోట్ల తనిఖీలు నిర్వహించినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. ఈ సోదాల్లో భారీగా అక్రమాస్తులను గుర్తించినట్లు తెలిపారు. నరహరి ఇంట్లో రూ. 1.54కోట్ల నగదు, రూ. 5.04 కోట్ల విలువ చేసే ఫిక్స్‌డ్ డిపాజిట్లు, బ్యాంకు ఖాతాలో రూ. 2.29 కోట్లు ఉన్నట్లు ఏసీబీ గుర్తించింది.

## రాష్ట్రవ్యాప్తంగా ఈగిల్ ఫోర్స్ దాడులు

- గోవా నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ సరఫరా
- 19మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- 14మందికి గంజాయి పాజిటివ్‌గా గుర్తింపు

**హైదరాబాద్,జూన్16 :**
తెలంగాణలోని వివిధ కమిషనరేట్ల పరిధిలో గంజాయి, డ్రగ్స్ వినియోగంపై భారీగా ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో మంగళవారం ఈగల్ ఫోర్స్ పలు ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించింది.



2లో..

## గచ్చిబౌలి స్టేడియంలో రగ్బీ ప్రీమియర్ లీగ్

### లాంఛనంగా ప్రారంభించిన మంత్రి వాకిటి శ్రీహరి




**హైదరాబాద్,జూన్16 :**
హెచ్.ఎస్. బి.సి రగ్బీ ప్రీమియర్ లీగ్ ను రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ప్రారంభించారు. హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలోని ప్రారంభోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.... రగ్బీ ఆట కోసం ఇక్కడికి విచ్చేసిన ఆటగాళ్లకు, కోచ్‌లకు, అధికారులకు, ఫ్రాంచైజీ యజమానులకు, భాగస్వాములకు, అభిమానులకు అభినందనలు తెలిపారు. రగ్బీ ప్రీమియర్ లీగ్‌ను నిర్వహించడానికి జి.ఎమ్.ఆర్ స్పోర్ట్స్ హైదరాబాద్‌ను ఎంచుకున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు.

మిగతాద్ది 2 లో



2లో..

## రాజకీయాలకు అతీతంగా ఉద్యమకారుల గుర్తింపు

### జూన్ 23 నుంచి దశలవారీగా సంప్రదింపులు: కెకె

**హైదరాబాద్,జూన్16 :**
తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో పాల్గొన్న ఉద్యమకారులను రాజకీయాలకు అతీతంగా గుర్తిస్తామని అందుకోసం ఏర్పాటైన కమిటీ స్పష్టం చేసింది. మంగళవారం తెలంగాణ అమరవీరుల స్మారక అమరజ్యోతిని ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సందర్శించింది. ఈ కమిటీ చైర్మన్ కె. కేశవరావు నేతృత్వంలో ఈ అమరజ్యోతి వేదికగా సమావేశమైంది.

## బిజెపికి లబ్ది చేకూర్చేలా సర్ ప్రక్రియ

- కేంద్రానికి తొత్తుగా మారిన ఎన్నికల సంఘం
- బెంగాల్లో 92 లక్షల ఓట్ల తొలగింపే నిదర్శనం
- బూత్ లెవల్ ఏజెంట్ల

సమావేశంలో పిసిసి చీఫ్ విమర్శలు



మిగతాది 2లో



## కేసీఆర్ హయాంలో స్కీంలు..
# కాంగ్రెస్‌లో స్కామ్‌లు

- కరోనాలో కూడా కెసిఆర్ రైతుబంధు ఏనాడూ ఆపలేదు
- రేవంత్ ముమ్మాటికీ ఎగవేతల రేవంత్ అంటాను
- కేసులు పెట్టినా భయపడేది లేదన్న హరీష్ రావు

**కరీంనగర్,జూన్ 16 :**
తెలంగాణ రాష్ట్రం ఏర్పాడ్డాక కేసీఆర్ హయాంలో స్కీంలు చేపడితే కాంగ్రెస్ పాలనలో రేవంత్ సర్కారు స్కాంలకు పాల్పడుతుందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు అన్నారు. ఎగవేతల రేవంత్ అంటే తనపై తిమ్మాపూర్ స్టేషన్ లో కేసు పెట్టినారని, ఇటీవల నోటీసులు ఇచ్చారని, ఆయన ఎగవేతల రేవంత్ అని మరోసారి అన్నారు. రైతు బంధు రూ. 19వేల కోట్లు ఎగబెట్టారని అన్నారు. కేసీఆర్ హాయాంలో కరోనా లాంటి క్లిష్ట పరిస్థితుల్లో సైతం ఏనాడు ఆపలేదని గుర్తు చేశారు. కరీంనగర్ జిల్లా అల్గునూర్ లో మానకొండూర్ నియోజకవర్గ స్థాయి డిజిటల్ సభ్యత్వ నమోదు తో పాటు సర్ పై విస్తృత స్థాయి సన్నాహాక సమావేశం మంగళవారం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన హరీష్ రావుకు అల్గునూర్ లో పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు.

మిగతాద్ది 2 లో

# కేసీఆర్ హయాంలో స్కీంలు.. కాంగ్రెస్‌లో స్కాంలు

మొదటి పేజీ తరువాయి
ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ మేనిఫెస్టోలో చెప్పని కేసీఆర్ ప్రభుత్వంలో రైతు బంధు, రైతు భీమా, కళ్యాణ లక్ష్మి లాంటి స్కీంలను కేసీఆర్ ప్రభుత్వం అమలు చేస్తే సివిల్ సప్లైలో, సింగరేణిలో, హామ్ రోడ్లలో, పిల్లలకు అన్నం పెట్టే గుడ్లలో, బట్టలలో స్కాంలు రేవంత్ సర్కాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఉపాధి కూలీలకు రూ.12వేలు ఇవ్వడం లేదని, మహిళలను కోటీశ్వరులను చేస్తామన్న రేవంత్ కుటుంబం కోటీశ్వరులు అవుతున్నారని విమర్శించారు. జిల్లాకు చెందిన బీసీ, ఎస్సీ సంక్షేమ మంత్రులకు తెలియకుండా స్కాంలు జరుగుతున్నాయని, జిల్లా పరువు పోతుందని, రూ.2వేల కోట్ల స్కాం జరిగినా వారికి తెలియలేదని, ఇందులో ఎనుమల వారిదే రాజ్యం నడుస్తోందన్నారు. పతకాల అమలుకు ఖజానా లేదంటున్న రేవంత్ ఫుట్ బాల్ ఆటకి, అందాల పోటీలకు, వాస్తు పేరుతో సచివాలయ పనులకు, పలుచోట్ల క్యాంపు ఆఫీసులకు వందల కోట్లు ఖర్చు చేస్తున్నాడని, ఆయనకు రైతులు, మహిళల పట్ల, పేదల పట్ల మనస్సు లేదని విమర్శించారు. మన సొమ్మును ఇతర రాష్ట్రాల్లో ప్రకటనలకు, ఎన్నికలకు, ఢిల్లీకి పంపిస్తున్నాడని ఆరోపించారు. కమిషన్లు రావని పేదల పథకాలు అమలు చేయడం లేదని, కమిషన్లు వచ్చే పనులను రేవంత్ చేపడుతున్నాడని విమర్శించారు. ఓట్లు పెట్టి దేవుణ్ణి మోసం చేసిన ఎగువేతల రేవంత్ రెడ్డి విద్యార్థులను, నిరుద్యోగులను, రైతులను. మోసం చేస్తున్నాడని అన్నారు. రైతు భీమా ప్రీమియం గడువు పూర్తయి నాలుగు నెలలు అయిందని, రైతులు చనిపోతే ఆ కుటుంభాల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. డిస్కం పేరుతో రైతులకు విద్యుత్తు కోతను తీసుకురానున్నారని ఆరోపించారు. రిజర్వాయర్లు, మెయిన్ కెనాల్స్ పూర్తి చేసి వేల ఎకరాలకు నీరిచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వముదేనని, పిల్ల కాలువలు పూర్తి చేస్తే మరిన్ని ఎకరాలకు నీరు అందించవచ్చన్నారు. అడుగడుగునా రైతులను వేధిస్తున కాంగ్రెస్ కి
ఎవరైనా ఓటు వేస్తారా అంటూ ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులపై కేసులు పెట్టి వేధిస్తున్న కాంగ్రెస్ ఓటమి అంచున ఉందన్నారు. వద్దుకొనే తెలివిలేని రేవంత్ బీఆర్ఎస్ ని మొలకెత్తనివ్వనని అంటున్నారని ఎద్దేవా చేశారు. రేవంత్ పరిస్థితి ఆయనకు అర్థమైందని, ఆయన పని అయిపోయినందునే అధికారులు ఆయన మాట వినడం లేదని ఎద్దేవా చేశారు. తెలంగాణ బాగుండాలంటే బీఆర్ఎస్ మళ్లీ గెలిచి కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని ఆయన అన్నారు. తెలంగాణ ఉద్యమంలో మానకొండూర్ నియోజకవర్గ ప్రజలు మనస్ఫూర్తిగా ఉద్యమం చేసినారని, 2001లో అన్నీ జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలను గెలుపొందిన నియోజకవర్గములో కరుడుగట్టిన కార్యకర్తలున్నారని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో 24 గంటల నాణ్యమైన కరెంటు ఇస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వంలో పదకొండు గంటలకు తగ్గిందని, రైతు డిస్కంను ప్రవేశపెట్టి ఆరు ఏడు గంటలకే కుదించనున్నారని తెలిపారు. రైతు డిస్కం పేరిట సోలార్, విండ్ పవర్ ఇచ్చేలా చూస్తున్నారని, రాత్రి పూట కరెంటు ఎలా వస్తుందని ఆయన ప్రశ్నించారు. రైతుల ఉసురు తీసేందుకు రైతు డిస్కంలను తీసుకురానున్నారని ఆరోపించారు. ఇలాంటి రేవంత్ కి రైతులు ఎవరైనా ఓటు వేస్తారా అంటూ ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ రైతులు సైతం కేసీఆర్ ని గుర్తు చేస్తున్నారని, రేవంత్ కి ఓటు వేసేందుకు సిద్దంగా లేరని అన్నారు. రీఎంబర్స్ మెంట్ ని నిధులు విడుదల చేయకపోవడంతో కళాశాలల్లో సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని హరీష్ రావు ఆరోపించారు. బలహీన వర్గాల పిల్లలంటే రేవంత్ కి ఇష్టం లేదన్నారు. ఇప్పటి వరకు సీఎం, మంత్రులు రీ ఎంబర్స్ మెంట్ విషయం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఉన్నత విద్యకు 30లక్షల మంది విద్యార్థులు దూరమై ఒక తరం వెనుకబడే ప్రమాదం ఉందన్నారు. కాంట్రాక్టర్లకు డబ్బులు ఇస్తున్న రేవంత్ సర్కారు పేద విద్యార్థులకు ఇవ్వడానికి మనస్సు రావడం లేదని విమర్శించారు. రెండు లక్షల ఉద్యోగాలిస్తామని చెప్పిన రేవంత్ కేవంల 16వేల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చిందని, నిరుద్యోగులను మోసం చేసిందని ఆరోపించారు. తెలంగాణ ఏర్పడ్డాక రాష్ట్రాన్ని సస్యశ్యామం చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని, 23 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరందంచినట్లు తెలిపారు. ప్రాజెక్టులు, ప్రధాన కాలువలు పూర్తి చేసినట్లు, పిల్ల కాలువలు అక్కడక్కడా పూర్తి చేస్తే మరిన్ని ఎకరాలకు నీరు అందించవచ్చన్నారు. ప్రతీ 20 ఏళ్లకోసారి ఓటరు జాబితా సవరణ (సర్) ని ఎన్నికల కమిషన్ చేపడుతుందని, దీనిపై బీఆర్ఎస్ కార్యకర్తలు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. విచారణ సమయంలో అధికారుల వెంట బీఆర్ఎస్ బూత్ ఇంచార్జీలు ఉండాలని సూచించారు. రివిజన్ సమయంలో ఇతర పార్టీల వారి పేర్లను తొలగించే ప్రమాదం ఉందని, జాగ్రత్తగా గమనించాలని తెలిపారు. ఈ సమావేశమంలో బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి జీవన్ రెడ్డి, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్.రమణ, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణా రావు, ఇంచార్జీ రవీంధర్ రావు, కార్పోరేటర్ కాల్వ మల్లేశం, నాయకులు రవీందర్ సింగ్, ఎర్రోళ్ల శ్రీనివాస్, చల్ల హరిశంకర్, కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, రావుల రమేష్, సిద్దం వేణు, శేఖర్ గౌడ్, స్వామిరెడ్డి, ఏకానందం, నాయిని వెంకట రెడ్డి, రవీంధర్ రెడ్డి, వెంకన్న, మహిపాల్, రెడ్డి, పొన్నం అనిల్ గౌడ్, గడ్డం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## సన్నరకం వరి విత్తనాలు సిద్దం చేయండి

మొదటి పేజీ తరువాయి
ఎరువుల పరిస్థితిపైన అన్ని పార్టీల ఎంపీలతో ఓ సమావేశం నిర్వహించి పరిస్థితిని వివరించాలని సీఎం పేర్కొన్నారు. ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్ బాబు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## రాష్ట్రవ్యాప్తంగా ఈగిల్ ఫోర్స్ దాడులు

మొదటి పేజీ తరువాయి
ఈ సందర్భంగా 19 మందిని ఈగల్ ఫోర్స్ అదుపులోకి తీసుకుంది. వారికి వైద్య పరీక్షలు నిర్వహించగా.. 14 మందికి గంజాయి పాజిటివ్, మరో వ్యక్తికి గంజాయితోపాటు డ్రగ్స్ పాజిటివ్ వచ్చింది. పట్టుబడిన వారందరూ డ్రగ్స్ వినియోగించినట్లు విచారణలో అంగీకరించారని ఈగల్ ఫోర్స్ వెల్లడించింది. వీరందరిని డీ అడిక్షన్ సెంటర్లకు తరలించామని పేర్కొంది. వీరి తల్లిదండ్రులకు సమాచారం అందించామని తెలిపింది. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్లతో పాటు మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాల్లో ఈగల్ ఫోర్స్ ఈ దాడులు చేసింది. ఈగల్ పోర్స్15 బృందాలను ఏర్పాటు చేసి వారి సమన్వయంతో ఈ ఆపరేషన్ నిర్వహించారు. విచారణలో గంజాయి, డ్రగ్స్ తీసుకున్న వారి నుంచి ఈగల్ ఫోర్స్ పలు కీలక విషయాలు రాబట్టింది. గోవాలోని వగటోర్ బీచ్ ప్రాంతాన్ని ఒక ముఠా కేంద్రంగా తీసుకుని కొకైన్, ఎండీఎంఏ, ఎల్ఎస్‌డీ, హ్యాష్ ఆయిల్ సరఫరా చేస్తున్నట్లు గుర్తించింది. వాటిని బెంగళూరు, గోవా నుంచి హైదరాబాద్‌కు రవాణా చేస్తున్నట్లు కనుక్కొంది. సినీ పరిశ్రమలోని పలువురికి వీటిని విక్రయించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. సాంకేతిక విశ్లేషణ ద్వారా మొత్తం 44 మంది వినియోగదారులను ఈగల్ ఫోర్స్ గుర్తించింది. డ్రగ్స్ వినియోగదారులు హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకతోపాటు గోవాలో ఉన్నట్లు విచారణలో బహిర్గతమైందని ఈగల్ టీం తెలిపింది. డ్రగ్స్ కొనుగోలు కోసం వినియోగదారులు చక్రపాణి, హర్షిత్ రెడ్డిల ఖాతాలకు రూ.3.13 లక్షలకుపైగా నగదు బదిలీ అయినట్లు గుర్తించింది. 2019లో వీరిద్దరు ఎన్‌డీపీఎస్ కేసులో అరెస్టయినట్లు ఈగల్ టీం వెల్లడించింది.

## అవినీతి అనకొండ నరహరి

మొదటి పేజీ తరువాయి
1.3 కిలోల బంగారం, 8 కిలోల వెండి ఆభరణాలు, భార్య పేరున రెండు బ్యాంకు లాకర్లు, కారు ఉన్నట్లు అధికారులు తేల్చారు. రంగారెడ్డి జిల్లాల్లో 5 ఓపెన్ ఎ÷–లాట్లు, మహేశ్వరంలో 1.24 ఎకరాల వ్యవసాయ భూమి, పుప్పాలగూడలో ఓ అపార్ట్‌మెంట్ ఉన్నట్లు గుర్తించారు. నార్సింగిలోని అపార్ట్‌మెంట్‌లో రెండు ఎ÷–లాట్లు, రాజేంద్రనగర్‌లో మరో ఎ÷–లాట్, గచ్చిబౌలి టీఎన్జీవో కాలనీలో జీప్లస్ 3 భవనం, ఛత్రినాకలో మూడంతస్తుల భవనం ఉన్నట్లు ఏసీబీ తేల్చింది. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఈ ఆస్తుల విలువ రూ.13.05 కోట్లు అని.. బహిరంగ మార్కెట్‌లో రూ.150 కోట్లకు పైనే ఉంటుందని అధికారులు వెల్లడించారు.

## ట్రంప్‌తో ప్రధాని మోడీ కరచాలనం

మొదటి పేజీ తరువాయి
గతేడాది ఫిబ్రవరి తర్వాత వీరిద్దరూ కలుసుకోవడం ఇదే మొదటిసారి. సదస్సులో వీరిద్దరూ పక్కపక్కనే కూర్చున్నారు. బుధవారం ఈ ఇరువురు నేతలు సమావేశం కాబోతున్నారు. భారత్–అమెరికా సంబంధాలు, ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, భద్రతా అంశాలు, ప్రాంతీయ పరిణామాలపై ఇద్దరు నేతలు చర్చించబోతున్నట్టు సమాచారం.జీ7 సదస్సుకు హాజరైన మోదీ ప్రపంచ నాయకులతో వరుసగా సమావేశాలు నిర్వహించనున్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో పాటు కెనడా ప్రధాన మంత్రి మార్క్ కార్నీ, బ్రిటన్ పీఎం కీర్ స్టార్మర్, యూఏఈ అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌లతో పలు ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించనున్నారు.

## రాజకీయాలకు అతీతంగా ఉద్యమకారుల గుర్తింపు

మొదటి పేజీ తరువాయి
జూన్ 23వ తేదీ నుంచి ఉద్యమకారుల గుర్తింపుపై దశలవారీగా సంప్రదింపులు జరుపుతామని కమిటీ వెల్లడించింది. అందుకోసం విద్యార్థి జేఏసీ, కళాకారులు, రచయితలతో సమావేశాలు నిర్వహిస్తామని తెలిపింది. అలాగే ప్రజా సంఘాలు, అడ్వకేట్లు, డాక్టర్ల అభిప్రాయాలను కూడా తీసుకుంటామని కమిటీ పేర్కొంది. 2001–2014 తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారితో చర్చలు జరుపుతామని వివరించింది. ఈ ఉద్యమకారుల గుర్తింపుపై విస్తృత స్థాయిలో సూచనల సేకరిస్తామంది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో అభిప్రాయాల స్వీకరణ జరపనున్నట్లు పేర్కొంది. ఉద్యమకారుల కోసం ప్రత్యేక వెబ్‌సైట్ ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా కమిటీ ప్రకటించింది. ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను పారదర్శకంగా చేపట్టనున్నట్లు తెలిపింది.

తెలంగాణ ఉద్యమ చరిత్రకు న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటామని వివరించింది. ఈ కమిటీ సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ కోదండరాం తదితరులు పాల్గొన్నారు.

# బిజెపికి లబ్ది చేకూర్చేలా సర్ ప్రక్రియ

మొదటి పేజీ తరువాయి
కేవలం బిజెపికి లాభం చేకూర్చేలా సర్ ప్రక్రియ సాగుతోందని తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మతతత్వ పార్టీలకు ప్రయోజనం చేకూరేలా ఎస్ఐఆర్ పక్రియ నిర్వహించే కుట్ర జరుగుతుందని విమర్శించారు. మంగళవారం సంగారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్‌పై బూత్ లెవెల్ ఏజెంట్ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో టీపీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. పశ్చిమ బెంగాల్‌లో ఎస్ఐఆర్ పేరుతో 92 లక్షల ఓట్లను అక్రమంగా తొలగించారని వివరించారు. ఈ పక్రియలో ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, జగ్గారెడ్డితోపాటు తన ఓటు గల్లంతు అయినా ఆశ్చర్య పోనక్కర్లేదని వ్యంగ్యంగా అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం భారత్ అని ,అలాంటి దేశంలో కేంద్ర ఎన్నికల సంఘం బీజేపీకి తొత్తుగా మారిందని ఆరోపించారు. 2002లో ఎస్ఐఆర్ పక్రియ పారదర్శకంగా జరిగిందని.. కానీ ప్రస్తుతం వారికి ఓట్లు పడవనుకుంటే వాటిని తొలగిస్తుందన్నారు. తమ ఓట్లు క్షేమంగా ఉండాలంటే బీఎల్ఏ కీలకంగా పని చేయాల్సి ఉంటుందని చెప్పారు. రాజకీయాల్లో తనకు దామోదర రాజనర్సింహ ఓనమాలు నేర్పించారని గుర్తు చేసుకున్నారు. ఈ దేశంలో అతికొద్దిమంది నిజాయితీ పరుల్లో మీనాక్షి నటరాజన్ ఒకరని పేర్కొన్నారు. అకారణంతోనే ఆమె రాజ్యసభ నామినేషన్ పత్రాన్ని తిరస్కరించారని తెలిపారు. బీజేపీ వాళ్లకి కనికరం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరంతరం అధికారంలో ఉండి చక్రవర్తుల్లా ఉండాలని బీజేపీ నేతలు అనుకుంటున్నారని వ్యాఖ్యానించారు. మీ కంటే పెద్ద చక్రవర్తులే నేలమట్టం అయ్యారు.. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షాలు ఎంత..? అని ప్రశ్నించారు. అధికారం శాశ్వతం అనుకుంటే.. వారు మూర్ఖులే అవుతారన్నారు. దేవుళ్లకు ఎవరు వ్యతిరేకం కాదు.. కానీ దేవుడి పేరు చెప్పనిదే బీజేపీ వాళ్లకు ఓట్లు పడవన్నారు.

ఏడాదిలో చాలాసార్లు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పూజలు నిర్వహిస్తారని.. కానీ దేవుళ్ల పేరుతో తాము ఓట్లు అడిగమన్నారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తానని.. ఉన్న ఉద్యోగాలను తీసేస్తున్నారంటూ కేంద్రంపై టీపీసీసీ చీఫ్ నిప్పులు చెరిగారు. ఇకపోతే జనసేన పార్టీ అధ్యక్షుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెనుక బీజేపీ ఉందని టీపీసీసీ చీఫ్ విమర్శించారు. కమలం పార్టీ ఆడించినట్టే.. ఆయన ఆడుతున్నారని ఆరోపించారు. మీ సానుభూతి తమకేం అవసరం లేదని పవన్‌కు స్పష్టం చేశారు. మీ కుట్రలు ప్రజలు గమనిస్తున్నారని పవన్‌కు సూచించారు. తెలంగాణ వచ్చినప్పుడు 10 రోజులు అన్నం తినలేదని పవన్ వ్యాఖ్యలను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఈ 12 ఏళ్లలో తెలంగాణకు ఏం చేశారో చిట్టా ఇవ్వాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డిని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు ఆయన కౌంటర్ ఇచ్చారు. కేంద్రం నుంచి రాష్టానికి ఇంకా నిధులు రావాల్సి ఉందన్నారు. విభజన హామీలను ఇప్పటి వరకు నెరవేర్చలేదంటూ కేంద్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు మీరు సబర్మతి కట్టుకో వచ్చు.. తాము మూసి ప్రక్షాళన చేస్తామంటే నిధులు ఇవ్వరని అసహనం వ్యక్తం చేశారు. వీటికి సమాధానం చెప్పాలంటూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి స్పష్టం చేశారు. ఓ వైపు బీజేపీ, మరో వైపు బీఆర్ఎస్ పార్టీలు రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక పోతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి దామోదర రాజనర్సింహ, టీజీఐఐసీ చీఫ్ నిర్మలా జగ్గారెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పాల్గొన్నారు.

## గచ్చిబౌలి స్టేడియంలో రగ్బీ ప్రీమియర్ లీగ్

మొదటి పేజీ తరువాయి
6 పురుషుల జట్లతో పాటు 4 మహిళల జట్లు ఈ ఈ లీగ్ లో పాల్గొనడం ఆనందదాయకమన్నారు . ఇది రగ్బీ ఆటకే కాకుండా భారతదేశంలో మహిళా క్రీడల అభివృద్ధికి కూడా ఒక ముఖ్యమైన ముందడుగని మంత్రి స్పష్టం చేశారు. కార్యక్రమాన్ని సాకారం చేయడానికి కలిసి పనిచేసిన జి.ఎమ్.ఆర్ స్పోర్ట్స్, రాహుల్ బోస్, రగ్బీ ఇండియా, ఫ్రాంచైజీ యజమానులు, స్పాన్సర్లు, బ్రాడ్‌కాస్టర్లు,భాగస్వాములందరికీ మంత్రి విషెస్ తెలియజేశారు. క్రీడలను ప్రోత్సహించే, యువ అ÷–లథెట్లకు స్ఫూర్తినిచ్చే భారతదేశ క్రీడా రంగాన్ని బలోపేతం చేసే ప్రతి ప్రయత్నానికి మద్దతు ఇవ్వడానికి తెలంగాణ ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రితోపాటు సాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి, ఎండి సోనీ బాలాదేవి, నిర్వాహకులు పాల్గొన్నారు.

## ముస్సోరిలో విశాఖకు చెందిన టెక్కీ మృతి

ఢిల్లీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న 27 ఏళ్ల రాధా గాయత్రి ముస్సోరీలో అనుమానాస్పద పరిస్థితుల్లో మృతిచెందిన ఘటన కలకలం రేపుతోంది. భర్తతో కలిసి విహారయాత్రకు వెళ్లిన ఆమె ముస్సోరీలోని హోమ్‌స్టే గదిలో విగతజీవిగా మారారు. మృతురాలిని పి. రాధా గాయత్రిగా గుర్తించారు. ఆమె భర్త సౌమ్య శ్రీచరణ్‌తో కలిసి సెలవులు గడిపేందుకు ఉత్తరాఖండ్‌లోని ముస్సోరీకి వెళ్లారు. రాధా గాయత్రి, శ్రీ చరణ్ ఇద్దరూ ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నానికి చెందిన వారు. వీరికి 2025 నవంబర్ 8న వివాహం జరిగింది. గాయత్రి ఢిల్లీలో నివసిస్తూ గురుగ్రామ్‌లోని ఒక ఐటీ సంస్థలో పనిచేస్తున్నారు. ఆమె భర్త శ్రీచరణ్ పుణెలో ఐటీ సంస్థలో పని చేస్తున్నారు. వీరిద్దరూ జూన్ 14 రాత్రి ముస్సోరీలోని కియానా హోమ్‌స్టేకు చేరుకున్నారు. భర్త చెప్పిన వివరాల ప్రకారం.. వారిద్దరూ ఆ రాత్రి మద్యం సేవించి, తెల్లవారుజామున 3:30 గంటలకు నిద్రపోయారు. శ్రీచరణ్ ఉదయం నిద్రలేచి చూసేసరికి.. గాయత్రి నగ్నంగా, స్పృహ లేకుండా, నేలపై పడి ఉంది. ఆమె ముక్కు నుంచి రక్తం కారుతోంది. హోమ్‌స్టే సిబ్బంది ముస్సోరీ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు 108 అంబులెన్స్‌తో కలిసి ఆ ప్రదేశానికి చేరుకున్నారు. అంబులెన్స్ సిబ్బంది ఆమెను పరీక్షించి, మరణించినట్లు ధ్రువీకరించారు. గాయత్రి మృతదేహం నేలపై బట్టలు లేకుండా పడి ఉందని, పరుపుపై రక్తపు మరకలు కనిపించాయని, గదిలో రెండు ఖాళీ మద్యం సీసాలు, ఆహార పదార్థాలు లభ్యమయ్యాయని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం డెహ్రాడూన్‌లోని కరోనేషన్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

## జూలై 19నుంచి ఉజ్జయినీ మహంకాళి బోనాలు
## ఆహ్వాన పత్రికను మంత్రి పొన్నంకు అందచేత

తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి దేవస్థానం ఆషాఢ బోనాల జాతర మహోత్సవాలకు ముస్తాబవుతోంది. ఈ ఏడాది నిర్వహించబోయే వార్షిక బోనాల జాతర కార్యక్రమాల అధికారిక షెడ్యూల్ వివరాలను ఆలయ చైర్మన్, అర్చక బృందం కలిసి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కి అందజేశారు. జాతరను అత్యంత వైభవంగా, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వహించేందుకు వీలుగా ముందస్తు ఏర్పాట్లపై చర్చించేందుకు ఈ వివరాలను మంత్రికి సమర్పించారు. ఆలయ దేవస్థానం ప్రకటించిన అధికారిక షెడ్యూల్ ప్రకారం.. జూలై 19వ తేదీ ఆదివారం సాయంత్రం 4:00 గంటలకు అమ్మవారి ఘటోత్సవం కార్యక్రమంతో ఈ మహోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభం కానున్నాయి. అనంతరం, జాతరలో అత్యంత కీలకమైన ప్రధాన బోనాల ఉత్సవాన్ని ఆగస్టు 2వ తేదీ ఆదివారం తెల్లవారుజామున 4:00 గంటల నుంచే ప్రారంభించనున్నారు. ఆ రోజంతా లక్షలాది మంది మహిళలు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకోనున్నారు. జాతర మరుసటి రోజైన ఆగస్టు 3వ తేదీ సోమవారం ఉదయం 8:30 గంటలకు భవిష్యవాణిని వినిపించే ప్రసిద్ధ రంగం కార్యక్రమం జరగనుంది. ఆ తర్వాత ఉదయం 10:30 గంటల సమయంలో అత్యంత కోలాహలంగా అమ్మవారి గజవాహన ఊరేగింపు మహోత్సవాన్ని నిర్వహించనున్నారు.

## బీసీలపై కక్షపూరిత చర్యలకు పాల్పడ్డ జగన్
## అమర్‌నాథ్ గౌడ్ హత్యే ఇందుకు నిదర్శనం

జగన్ హయాంలో బీసీలకు అన్యాయం జరిగిందని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఫైర్ అయ్యారు. వైసీపీ హయాంలో బీసీలపై కక్షపూరిత చర్యలకు పాల్పడ్డారని దుయ్యబట్టారు. బీసీలు అంటే జగన్‌కు ఎంత కక్షో అమర్నాథ్ గౌడ్ సజీవదహనం నిరూపించిందని పేర్కొన్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలపై గొడ్డలి పార్టీ కక్షగట్టిందని ధ్వజమెత్తారు. మంగళవారం అమరావతి వేదికగా మీడియాతో మంత్రి లోకేశ్ మాట్లాడారు. తన అక్కను గొడ్డలి పార్టీ నేతలు వేధిస్తుంటే ప్రశ్నించినందుకు జూన్ 15, 2023న బడికి వెళు_న్న 15ఏళ్ల బీసీ బాలుడు అమర్నాథ్ గౌడ్‌ను దారుణంగా కొట్టి, కట్టేసి సజీవ దహనం చేశారని మండిపడ్డారు.నాడు గొడ్డలి పార్టీ నిందితులను రక్షించేందుకు ప్రయత్నించిందని మంత్రి లోకేశ్ ఆగ్రహించారు. అన్యాయంగా అమర్‌నాథ్ గౌడ్‌ని చంపేశారని.. ఆయన మృతిచెంది మూడేళ్లు అవుతోందని తెలిపారు. గొడ్డలి పార్టీ వల్ల అన్నివిధాలా నష్టపోయిన అమర్నాథ్ గౌడ్ కుటుంబానికి అండగా ఉంటామని మంత్రి నారా లోకేశ్ భరోసా కల్పించారు. వైసీపీ పైశాచికత్వానికి పరాకాష్ట అమర్నాథ్ గౌడ్ హత్య అని మంత్రి కొల్లు రవీంద్ర మండిపడ్డారు. ఐదేళ్ల పాలనంతా బడుగు బలహీన వర్గాలను వేధించడమేనని ఆగ్రహించారు. చేయాల్సిన అరాచకాలన్నీ చేసి ఇప్పుడు వైసీపీ నేతలు నీతులు చెబుతున్నారని విమర్శించారు. కుట్రలతో రాష్ట్రంలో అలజడులే అజెండాగా జగన్ రెడ్డి అడుగులేస్తున్నారని దుయ్యబట్టారు. అమర్నాథ్ గౌడ్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి అర్పించారు మంత్రి కొల్లు రవీంద్ర.

## పారదర్శకంగా యూరియా పంపిణీ
## ఫర్టిలైజర్ యాప్ ద్వారా ఇంటినుంచే బుకింగ్

**ఇప్పటికే 4.06 లక్షల మంది రైతులకు లబ్ది**
**క్యూ లైన్లు కట్టాల్సిన దుస్థితి రాకుండా నిర్ణయం**
**వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

రైతులకు పారదర్శకంగా యూరియా పంపిణీ చేస్తామని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. మంగళవారం కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డిలో మంత్రి మాట్లాడుతూ.. క్యూ లైన్లు అవసరం లేకుండా ఇంటి నుంచే యూరియా బుకింగ్ చేసుకునే సౌకర్యాన్ని రైతులకు కల్పిస్తామన్నారు. ఫర్టిలైజర్ యాప్ ద్వారా ఇప్పటికే 4.06 లక్షల మంది రైతులు బుకింగ్ చేసుకున్నారని వివరించారు. మొత్తం13.22 లక్షల యూరియా బస్తాల బుకింగ్ చేసుకుంటే.. 84.6 శాతం పంపిణీ పూర్తి చేశామని తెలిపారు. రాష్ట్రంలో 90.22 లక్షల యూరియా బస్తాల భారీ నిల్వలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. రైతుల సూచనలతో ఫర్టిలైజర్ యాప్‌లో నిరంతర మార్పులు చేస్తున్నట్లు చెప్పారు. స్మార్ట్ ఫోన్ లేని రైతులకు టోల్ ఫ్రీ ద్వారా యూరియా బుకింగ్ చేసుకునే అవకాశాన్ని కల్పించామని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ టోల్ ఫ్రీ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ యాప్ వినియోగంలో నిజామాబాద్ జిల్లా రైతులు రాష్ట్రంలో ముందంజలో ఉన్నారని ప్రశంసించారు. యూరియా బ్లాక్ మార్కెటింగ్, అక్రమ రవాణాకు చెక్ పెట్టేందుకే ఈ డిజిటల్ విధానం అమల్లోకి తీసుకొచ్చినట్లు వివరించారు. నిజమైన రైతులకు మాత్రమే ఎరువులు అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు.అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావం ఉన్నా యూరియా కొరత రానివ్వమని రైతులకు ఈ సందర్భంగా మంత్రి తుమ్మల భరోసా కల్పించారు. పెద్ద రైతులు ఆందోళన చెంద వద్దని.. అందరికీ సమానంగా ఎరువుల పంపిణీ చేస్తామన్నారు. అధిక యూరియా వినియోగం భూసారానికి హానికరం అని రైతులను ఆయన హెచ్చరించారు. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది తక్కువ వర్షాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని రైతులకు స్పష్టం చేశారు. వర్షాభావ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలంటూ రైతులకు మంత్రి తుమ్మల సూచించారు.

# ఆర్.ఎస్.ఎస్ ను ప్రశ్నించి చిక్కుల్లో పడ్డ కాంగ్రెస్

» కర్ణాటక హోం మంత్రి ప్రియాంక్ ఖర్గే

» టైం పాస్ వాదనలు

**శివప్రసాద్,మేనేజింగ్ ఎడిటర్**

కర్ణాటక హోం మంత్రి ప్రియాంక్ ఖర్గే, ఆర్ఎస్ఎస్ (RSS) సరసంఘచాలక్ మోహన్ భాగవత్‌కు బహిరంగ లేఖ రాస్తూ, ఆ సంస్థ చట్టబద్ధమైన రిజిస్ట్రేషన్, నిధుల పారదర్శకత మరియు పన్నుల చెల్లింపులపై తీవ్రమైన ప్రశ్నలు గుప్పించారు. ఒక ప్రజాస్వామ్య దేశంలో ఎంతటి పెద్ద సంస్థ అయినా చట్టానికి, పారదర్శకతకు లోబడి ఉండాలని ఆయన డిమాండ్ చేశారు.

## ప్రియాంక్ ఖర్గే సంధించిన ప్రధాన ప్రశ్నలు మరియు డిమాండ్లు

» చట్టబద్ధమైన రిజిస్ట్రేషన్ ఎందుకు లేదు?

» నిధులు మరియు విరాళాల మూలాలు ఏమిటి?

» పన్నుల మినహాయింపు మరియు తనిఖీల నుండి తప్పించుకోవడం ఎందుకు?

» RSS కు ఎన్‌జీఓల తరహా పారదర్శకత ఉండాలి.

ఈ బహిరంగ లేఖకు RSS బహిరంగ స్పందన

ఈ ప్రశ్నలపై ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ స్పందిస్తూ.. ఖర్గే చేసిన డిమాండ్లు కేవలం రాజకీయ ప్రేరేపితమైనవని కొట్టిపారేశారు. ఆర్ఎస్ఎస్ ఎలాంటి ప్రభుత్వ నిధులు ఆశించడం లేదని, తాము బహిరంగంగానే సమాజంలో పనిచేస్తున్నామని అన్నారు. కోర్టులు మరియు ఐటీ శాఖలు కూడా తమను 'బాడీ ఆఫ్ ఇండివిడ్యువల్స్'గా గుర్తించి మినహాయింపులు ఇచ్చాయని ఆయన స్పష్టం చేశారు.

» అసలు ఆర్.ఎస్.ఎస్ గురించి ఏమీ తెలియని వారు గుడ్డిగా ద్వేషిస్తూ ఉంటారు.ఈ వాదనలకు ఆర్.ఎస్.ఎస్ అంధ విరోధులు తానా తందానా అంటుంటారు.

» రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (RSS) కోర్ సంస్థ పేరిట ఎలాంటి ఆస్తులు నేరుగా రిజిస్టర్ అయి లేవు, ఎందుకంటే ఆర్ఎస్ఎస్ ఒక రిజిస్టర్డ్ సంస్థ (Society/Trust/NGO) కాదు.

భారత చట్టాల ప్రకారం దీనిని ఒక 'బాడీ ఆఫ్ ఇండివిడ్యువల్స్' (Body of Individuals) లేదా వ్యక్తుల సమూహంగా గుర్తిస్తారు. సంస్థ ప్రధాన కార్యాలయాలు, కార్యాలయాలు మరియు ఇతర చరస్థిరాస్తుల యాజమాన్యం క్రింది పద్ధతుల్లో నిర్వహించబడుతుంది.

**1.అనుబంధ సంస్థలన్నీ స్వతంత్ర ట్రస్టుల పేరిట ఆస్తులు.**

(Affiliated Legal Trusts)

ఆస్తుల కొనుగోలు, విరాళాల సేకరణ మరియు శాశ్వత కార్యాలయాల నిర్వహణ కోసం ఆర్ఎస్ఎస్ స్వతంత్రంగా రిజిస్టర్ అయిన ట్రస్టులు లేదా సొసైటీలను ఏర్పాటు చేస్తుంది.

ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నడిచే వివిధ భవనాలు, ప్రచురణాలయాలు (ఉదాహరణకు: సురుచి ప్రకాశన్), విద్యాసంస్థలు (విద్యాభారతి), మరియు సేవా సంస్థలు (సేవాభారతి) చట్టబద్ధంగా రిజిస్టర్ అయిన స్థానిక లేదా జాతీయ ట్రస్టుల పేరిట రిజిస్ట్రేషన్ అయి ఉంటాయి.

ఈ ట్రస్టులు ప్రభుత్వం నుండి పన్ను మినహాయింపులు పొందుతూ, ఆదాయ వ్యయాల ఆడిటింగ్ నిర్వహిస్తాయి.

**2. ప్రాంతీయ బాధ్యుల పేరిట ఇతర ఆస్తులు.**

» స్థానికంగా ఉండే చిన్న కార్యాలయాలు, శాఖల నిర్వహణకు సంబంధించిన ఆస్తులను ఆయా ప్రాంతాల సీనియర్ ప్రతినిధులు (ప్రాంతీయ నిర్వాహకులు/ట్రస్టీలు) వ్యక్తిగతంగా లేదా సంయుక్తంగా తమ బాధ్యతలను నిర్వహిస్తుంటారు.

» ఆర్ఎస్ఎస్ స్వతంత్ర భారతదేశ చట్టాల పరిధిలోనే పనిచేస్తోందని, దీనికి ప్రత్యేకంగా రిజిస్ట్రేషన్ తప్పనిసరి కాదని పేర్కొన్నారు.

» హిందూ ధర్మానికి ఏ విధంగా ప్రత్యేక రిజిస్ట్రేషన్ లేదో, అదే విధంగా ఆర్ఎస్ఎస్ కూడా ఒక స్వచ్ఛంద సామాజిక సమూహంగా చట్టబద్ధమైన గుర్తింపు పొందిందని, ప్రభుత్వ నిధులు ఆశించని కారణంగా కోర్ ఆర్గనైజేషన్ నమోదు అవసరం లేదని వారు స్పష్టం చేశారు.

» సంక్షిప్తంగా చెప్పాలంటే, ఆర్ఎస్ఎస్ నేరుగా తన పేరు మీద కాకుండా, తన గొడుగు కింద పనిచేసే వందలాది చట్టబద్ధమైన రిజిస్టర్డ్ ట్రస్టుల పేరిట ఆస్తులను కొనుగోలు మరియు నియంత్రణ చేస్తుంది.




ఆర్.ఎస్.ఎస్ సర్ సంఘ్ చాలక్ శ్రీ మోహన్ భాగవత్ కర్ణాటక లో వందేళ్ళ RSS శతాబ్ది ఉత్సవ కార్యక్రమంలో సవివరంగా మాట్లాడారు. కర్ణాటకలోని బెంగళూరులో, ఆర్ఎస్ఎస్ 100 సంవత్సరాల ప్రయాణాన్ని గుర్తుచేసే "న్యూ హారిజన్స్" అనే అంశంపై రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సరసంఘచాలక్ మోహన్ భాగవత్ అనేక ప్రశ్నలకు సమాధానమిచ్చారు.

» **1925లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ పురుడు పోసుకుంది. ఆ సమయంలో బ్రిటిష్ ప్రభుత్వం కొనసాగుతోంది. ఎవరికైతే వ్యతిరేకంగా పనిచేశామో? ఎవరి చట్టాలను ధిక్కరించామో.. వారి ప్రభుత్వంలో రిజిస్టర్ నమోదు చేసుకోలేదని ఆర్ఎస్ఎస్ చీఫ్ క్లారిటీ ఇచ్చారు. స్వాతంత్ర్యం తర్వాత, స్వతంత్ర భారతదేశ చట్టాలు రిజిస్ట్రేషన్‌ను తప్పనిసరి చేయలేదని ఆయన అన్నారు.**

» **ప్రస్తుతం రిజిస్టర్ కాని వ్యక్తుల మృతదేహాలకు కూడా చట్టపరమైన హోదా ఇవ్వడం జరుగుతుంది. అందుకే మమ్మల్ని ఈ వర్గంలో ఉంచి ఒక సంస్థగా గుర్తించారని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ అన్నారు. ఆర్ఎస్ఎస్‌ను మూడుసార్లు నిషేధించారని, అంటే ప్రభుత్వం మమ్మల్ని గుర్తించిందని దాని అర్థమని ఆయన స్పష్టం చేశారు.**

**జమనం లేకపోతే, వాళ్ళు ఎవరిని నిషేధిస్తారు?**

ప్రతిసారీ, కోర్టులు నిషేధాన్ని ఎత్తివేసి, RSS ని చట్టబద్ధమైన సంస్థగా గుర్తించాయి. పార్లమెంటులో ఇతర చోట్ల అనేక సార్లు, అనేక ప్రశ్నలు లేవనెత్తారు అని =రూ చీఫ్ అన్నారు.

» **చట్టబద్ధంగా, మేము ఒక సంస్థ కాబట్టి మేము రాజ్యాంగ విరుద్ధం కాదు. చాలా సందర్భాల్లో,చాలా విషయాల్లో ఇది రుజువైంది. హిందూ మతం కూడా నమోదు చేయ బడలేదు" అని ఆయన అన్నారు.**

**మేము కాకపోతే, వారు ఎవరిని నిషేధించేవారు?**

అని ఆర్ఎస్ఎస్ చీఫ్ ఎదురు ప్రశ్నించారు. సంఘ్ పరివార్ సంస్థలన్నింటికీ ఆర్.ఎస్.ఎస్ మాతృ సంస్థ.ఒక గొడుగు లాంటిది అని ప్రస్తావిస్తూ మోహన్ భగవత్ వాదించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాజకీయాల్లోకి రాకముందు తన ప్రజా సంబంధాల వృత్తిని ప్రారంభించిన ప్రదేశం ఇదే.

ఆదాయపు పన్ను శాఖ, కోర్టులు.. ఆర్ఎస్ఎస్ వ్యక్తుల సంస్థ అని గుర్తించి, దానిని పన్ను నుండి మినహాయించాయని ఆయన పేర్కొన్నారు.

హిందూ సమాజం దాని కీర్తి శిఖరాగ్రంలో ఉందని, ఎల్లప్పుడూ ప్రపంచాన్ని ఏకం చేయాలని కోరుకుంటుందని సర్ సంఘచాలక్ మోహన్ భగవత్ అన్నారు.

భారత ముస్లింలు, క్రైస్తవులందరూ ఒకే పూర్వీకుల వారసులని భగవత్ స్పష్టం చేశారు. వారికి అది తెలియకపోవచ్చు, వారు దానిని మరచిపోయేలా చేసి ఉండవచ్చు, కానీ మిగతా వారందరికీ వారు హిందువులని తెలుసునని అన్నారు.

మన పూర్వీకులు మొత్తం సృష్టికి, మానవాళికి మధ్య సంబంధాన్ని కనుగొన్నందున ఈ ఐక్యత స్థితి సాధించినట్లు ఆయన అన్నారు.

### ▪ అసలెందుకీ చర్చ?

జాతి అంటే,భారత సంస్కృతి అంటే ఏమిటో మరచిపోయిన వారు సెక్యులర్ వాదనలతో పనిలేని చర్చలు చేస్తుంటారు.

మనం విడివిడిగా, భిన్నంగా కనిపించినప్పటికీ, ఒకే ఐక్యతను సూచిస్తాము. ప్రతి వ్యక్తి అత్యున్నత లక్ష్యం ఆ ఐక్యతను గ్రహించడం, ఆనందాన్ని పొందడం.

భారతీయత ఒక బంధం.ఆ బంధం శాశ్వతమైనది.

ఈ దేశంలో పుట్టిన ప్రతి భారతీయ మతం ఇదే బోధిస్తుంది.

» **రాజ్యాంగ ప్రవేశిక చదివితే భారతీయత అర్థం అవుతుంది.అక్కడ కూడా అదే ఆలోచన ప్రతిబింబిస్తుంది.**

మన సమాజాన్ని సాంప్రదాయకంగా,భాగోళికంగా హిందూ అని పిలుస్తారు. హిందూ సమాజం వ్యవస్థీకృతం. ఎన్ని సవాళ్లు ఎదురైనా హైందవం,భారతీయత అజరామరంగా నిలిచి ఉంటుంది.

ఆర్.ఎస్.ఎస్ సంస్థ కు రిజిస్ట్రేషన్ లేదని వాదన లేవదీసిన కాంగ్రెస్ మరొక్కసారి పరువు పోగొట్టుకున్నది.

భారత రాజ్యాంగం,భారత చట్టాలు ఆర్.ఎస్.ఎస్ పనితీరుకు చాలాసార్లు ఆమోద ముద్ర వేసాయి.

కాంగ్రెస్ పార్టీ పై తనకు,తన కుటుంబానికి యాజమాన్య హక్కులు ఉన్నాయని భావించే రాహుల్ గాంధీ కర్ణాటకలో తమ పార్టీ అధికారంలో ఉందని టైం పాస్ పేచీలు పెడుతుంటాడు.

» **చట్టాల లోతులు తెలియని రాహుల్ గాంధీ రాజ్యాంగ పుస్తకం పట్టుకుని అనవసర వాదనలు చేస్తూ కాలం గడుపుతున్నాడు.**

సెక్యులర్ రోగ గ్రస్తుడైన కర్ణాటక హోం మంత్రి ప్రియాంక్ ఖర్గే తో ఆర్.ఎస్.ఎస్ పై వివాదం రేపాలని ప్రయత్నించిన రాహుల్ గాంధీ తో పాటు కాంగ్రెస్ పార్టీ మళ్లీ ఒకసారి తమ పరువు తామే తీసుకున్నారు.

ఆర్.ఎస్.ఎస్ ను కాంగ్రెస్ నిషేధించలేదు.ఒకవేళ ఆ పని చేస్తే కోర్టులు కాంగ్రెస్ తలపై గట్టి మొట్టికాయ వేస్తాయి.

▪ **ప్రజలు కాంగ్రెస్ ను భూస్థాపితం చేస్తారు.**

## నిబంధనలు ఉల్లంఘించే పాఠశాల వాహనాలపై కఠిన చర్యలు

మోటార్ వాహన తనిఖీ అధికారి పృథ్వీరాజ్ వర్మ

**కరపత్రం ప్రతినిధి రాజన్న సిరిసిల్ల**

పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లాలోని పాఠశాల వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు మోటార్ వాహన తనిఖీ అధికారి (ఎంవీఐ) పృథ్వీరాజ్ వర్మ తెలిపారు. మంగళవారం వేములవాడ నందికమాన్ వద్ద చేపట్టిన తనిఖీల్లో పలు స్కూల్ బస్సులను పరిశీలించారు. ఈ సందర్భంగా నిబంధనలను పాటించని అల్ఫోర్ పాఠశాల బస్సును గుర్తించిన అధికారులు, వాహనానికి సంబంధించిన పత్రాలు, భద్రతా ప్రమాణాలను తనిఖీ చేశారు.



తనిఖీల సమయంలో బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎంవిఐ పృథ్వీరాజ్ మాట్లాడుతూ స్కూల్ బస్సు డ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫాం, ఐడీ కార్డు, చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. అలాగే బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్, ఎమర్జెన్సీ ఎగ్జిట్ వంటి భద్రతా సదుపాయాలు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. విద్యార్థుల సంఖ్యకు మించి బస్సుల్లో ఎక్కించరాదని, వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికేట్, ఇన్సూరెన్స్, పర్మిట్, పొల్యూషన్ సర్టిఫికెట్లు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. వేగ పరిమితులను పాటిస్తూ విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని డ్రైవర్లకు సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే పాఠశాల వాహనాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పృథ్వీరాజ్ హెచ్చరించారు.

## గట్టుప్పల పుట్టపాక రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చాలి

▪ మాజీ జడ్పీటిసి కర్నాటి వెంకటేశం

**గట్టుప్పల.జూన్ 16. కరపత్రం ప్రతినిధి**

గట్టుప్పల పుట్టపాక సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డు గా మార్చాలని మాజీ జడ్పీటిసి కర్నాటి వెంకటేశం అన్నారు.మంగళవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గట్టుప్పల పుట్టపక రోడ్డు ప్రధానమైందని రోడ్డు పంచాయతీరాజ్ డిపార్ట్మెంట్ క్రింద ఉన్నందున, ఇట్టి రోడ్డును ఆర్ డబి కి మార్చి డబుల్ రోడ్డుగా మార్చాలని కోరారు. గట్టుప్పల పరిసర ప్రాంతాలే కాకుండా చండూరు నుండి హైదరాబాద్ పోచంపల్లి నుండి వ్యాపార నిమిత్తం వెళ్ళే ప్రయాణికులు సింగిల్ రోడ్డు ఉన్నందున అనేక ఇబ్బందులు పడుతూ ప్రమాదాలు జరుగుతున్నయని తెలిపారు ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకొని ఈ ప్రాంతానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన ఇట్టి రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చాలని ఎమ్మెల్యేను అధికారులను కోరారు.? సమావేశంలో చిలుకూరి ఆంజయ్య, పద్మశాలి యువజన సంఘం అధ్యక్షులు పున్న కిషోర్, వార్డ్ మెంబర్లు బావండ్ల శ్రీనివాస్, పున్న ఆనంద్, నారని జగన్, జూలూరి పురుషోత్తం, చెరుపల్లి నగేష్, కొడగాని శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## భవాని శంకరాలయం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్‌కు ఆహ్వానం

## నూతన అధికారులను మర్యాదపూర్వకంగా కలిసిన టీఎన్జీవోల నాయకులు

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ జూన్ 16**

కరీంనగర్ భగత్‌నగర్‌లోని టీఎన్జీవోల కాలనీలో నిర్మితమైన శ్రీ భవాని శంకరాలయం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఆలయ విగ్రహ పునః ప్రతిష్ఠ కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను జిల్లా కలెక్టర్ గారికి అందజేసి, కార్యక్రమానికి విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు. అదేవిధంగా ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కరీంనగర్ ఆర్డీవో శర్మిల ని ఆర్డీవో కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపి, వారి పదవీకాలం విజయవంతంగా కొనసాగాలని



ఆకాంక్షించారు.నూతనంగా జిల్లా రెవెన్యూ అధికారిగా (డీఆర్ఓ) బాధ్యతలు చేపట్టిన కె. స్వామి ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ జిల్లాభివృద్ధికి కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమాలలో టీఎన్జీవోల జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి ,కార్యదర్శి సంఘం లక్ష్మణరావు, కేంద్ర సంఘం నాయకులు రాగి శ్రీనివాస్, గూడ ప్రభాకర్ రెడ్డి ,గంగారపు రమేష్ గౌడ్ , జిల్లా కోశాధికారి కిరణ్ కుమార్ రెడ్డి ,పట్టణ అధ్యక్షులు మారుపాక రాజేష్ భరద్వాజ్, కార్యదర్శి వెలిచాల సుమంతరావు, రూరల్ అధ్యక్షులు వాస్తవిక్ గౌడ్ ,కార్యదర్శి కొమ్మర శ్రీనివాస్ రెడ్డి ,మహిళా నాయకులు శారద ,సునీత, శైలజ ,నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కోట రామస్వామి, కార్యదర్శి శంకర్ ,సంఘం నాయకులు కరుణాకర్, లవ కుమార్ ,నారాయణ ,శ్రీనివాస్, అన్నాడి శ్రీనివాస్ రెడ్డి, రవీందర్ , ఆలయ కమిటీ ప్రతినిధులు, రాజి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అథ్లెటిక్స్ 100 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థి సన్మానం

**గజ్వేల్ జున్ 16,కరపత్రం ప్రతినిధి**

ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్వయం ప్రతిపత్తి గజ్వేల్ కు చెందిన టి జ్ఞానేశ్వర్ ఇటీవల జరిగిన తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ 100 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం పొందాడు.ఈ సందర్భంగా విద్యార్థి జ్ఞానేశ్వరుని కళాశాల ప్రిన్సిపల్ మరియు అధ్యాపక బృందం సన్మానించింది.క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక దృఢత్వం కలుగుతుందని రాష్ట్రస్థాయిలో జరిగిన వంద మీటర్ల పరుగు పందెంను 12 సెకండ్లలో పూర్తిచేసి రెండవ స్థానం పొందిన జ్ఞానేశ్వర్ కళాశాలకు పేరు తెచ్చాడని ప్రిన్సిపల్ డాక్టర్ నికత్ అంజుమ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రీడావిభాగం బాధ్యులు ఆర్ మహేందర్ రెడ్డి మరియు ఇతర అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## ఆర్డీవో కు వినతిపత్రం సమర్పించిన క్రీడాకారులు

**గజ్వేల్ జున్ 16,కరపత్రం ప్రతినిధి**

గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించడానికి తెలంగాణ ప్రభుత్వం సహకరించాలని సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్ సి సంతోష్ అన్నారు మంగళవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో అన్ని రకాల క్రీడాకారుల ఆధ్వర్యంలో ఆర్డీవో చంద్రకళ కు వినతి పత్రం సమర్పించారు ఈ సందర్భంగా ఎన్ సి సంతోష్ మాట్లాడుతూ, గత బిఆర్ఎస్ ప్రభుత్వం గజ్వేల్ లో క్రీడాకారుల కోసం దాదాపు 20 ఎకరాల భూమిని కేటాయించిందని సర్వేనంబర్ 560 / 16 లో గల 20 ఎకరాల ప్రభుత్వ భూమి క్రీడా హబ్ నిర్మాణం కోసం రెవెన్యూ రికార్డులను, యువజన, క్రీడల శాఖ పేరిట మార్పు చేయవలసి ఉన్నది, ఈ ప్రక్రియ ప్రారంభించడం ప్రారంభమైన సంబంధిత శాఖల సమన్వయ లోపంతో ఆలస్యం అవుతుందని వెంటనే యువత క్రీడల్లో రాణించాలని ఒక మంచి సంకల్పంతో అధికారులు నాయకులు క్రీడా హబ్ అందుబాటులోకి తీసుకురావడానికి సహకరించాలని కోరారు ఈ కార్యక్రమంలో హరిచంద్ర ప్రసాద్, శివ, రాజు, కనకయ్య, ఇలియాస్, స్వామి తదితరులు పాల్గొన్నారు

## క్రమశిక్షణతో బ్రతికిన గొప్ప వ్యక్తి ఉల్పె కృష్ణ

**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్, జూన్ 16**

తెలుగు బుక్ ఆఫ్ రికార్డు అవార్డు గ్రహీత దివంగత ఊ ల్పే కృష్ణ క్రమశిక్షణే ఊపిరిగా కష్టమే ఇష్టంగా నిరాడంబరతే ఆలంబనగా చెరగని చిరునవ్వుతో అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ అందరి హృదయాలలో మంచి పేరు సంపాదించుకున్న కృష్ణ మీ జ్ఞాపకాలు మా అందరిలో మెదులుతూనే ఉంటున్నాయని తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు కొలుపుల నరసింహ పేర్కొన్నారు. మంగళవారం జియాగూడ కురుమ బస్తి లో శ్రీ రంగనాథ స్వామి కల్చరల్ అసోసియేషన్ మైదానంలో ఉల్పె కృష్ణ ( డోలక్ కృష్ణ) ప్రథమ వర్ధంతి సంతాప సభ నిర్వహించారు. ఈ సభకు కురుమ సంఘం రాష్ట్ర నాయకులు కొలుపుల నరసింహ, నర్సా వినోద్ కుమార్, ఉల్పె శ్రీనివాస్, రాకేష్, గోవింద్ రాజ్, జ్యోతి అమర్ బాబు, ఉల్పే శ్రీనివాస్, ఉల్పే శ్రీధర్ లు ముఖ్య అతిథులుగా హాజరై కృష్ణ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు, ఈ సందర్భంగా కొలుపుల నరసింహ, శ్రీనివాస్ లు మాట్లాడుతూ.. కృష్ణ కురుమ సంఘం అభివృద్ధితోపాటు, ఆధ్యాత్మిక భజనలు నిర్వహిస్తూ, ప్రజల్లో భక్తి ఆధ్యాత్మిక చింతనను ఎంతో పెంపొందించేందుకు కృషి చేసిన గొప్ప వ్యక్తి కృష్ణ అని వారు కొనియాడారు. తెలంగాణ రాష్ట్రంలోని పాతబస్తీలో, డోలక్ కళాకారులకు, భజన కళాకారులకు, ఎంతో పేరు తెచ్చి తీసుకువచ్చేందుకు కృష్ణ అహర్నిశలు పాటుపడ్డాడని వారు సందర్భంగా గుర్తు చేశారు, ఈ సందర్భంగా, జంట నగరాలకు చెందిన, 10,భజన మండలి నిర్వాహకులు, శ్రీనివాస్, ప్రతాప్ సింగ్, ఆంజనేయులు, లక్ష్మణ్, పాన్ మండి కృష్ణ,, కే శ్రీనివాసులు తమ భజన మండలి, పలు భక్తి ఆధ్యాత్మిక గీతాలను, ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలపించి, ఆహుతులను అమితంగా ఆకట్టుకున్నారు, ఈ కార్యక్రమంలో, కృష్ణ సతీమణి, ఉల్పె లలిత, గుజ్జ సంగీత, గుజ్జ వెంకటేష్, బాలం కిరణ్ జ్యోతి, బాలం సంతోష్, అఖిల్, నిఖిల్, సాయి, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
బుధవారం జూన్ 17, 2026

## జగ్గయ్యపల్లి బొడ్రాయి ఉత్సవాలకు మున్సిపల్ చైర్మన్‌కు ఆహ్వానం




**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, జూన్ 16:**
జగ్గయ్యపల్లి గ్రామంలో ఈ నెల 17 నుంచి 19 వరకు నిర్వహించనున్న శ్రీ భూలక్ష్మీ, మహాలక్ష్మీ, నాభిశిల (బొడ్రాయి) పోచమ్మ తల్లి పంచదశ వార్షికోత్సవాల సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్‌కు ఉత్సవ కమిటీ సభ్యులు ఆహ్వాన కరపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, గ్రామంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ఈ వార్షికోత్సవాలకు హాజరై అమ్మవార్ల ఆశీస్సులకు పాత్రులు కావాలని మున్సిపల్ చైర్మన్‌ను కోరారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు, ధార్మిక కార్యక్రమాలు, భక్తి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, కౌన్సిలర్ పొనగంటి రాము, ఉత్సవ కమిటీ సభ్యులు, మాజీ సర్పంచ్ కనపర్తి వంశీధర్ రావు, ఉప సర్పంచ్ నాయినేని వెంగల్ రావు, ఉపేందర్, శ్రీకాంత్, శ్రీనివాస్, సంపత్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.జగ్గయ్యపల్లి గ్రామంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్న ఈ ఉత్సవాలకు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

## కరీంనగర్ జాతీయ చెస్ పోటీలకు ఎంపికైన గొడ్డటి వర్షితకు మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు ఘన సత్కారం.

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ జూన్ 17**
కరీంనగర్ విశ్వనాథ్ చెస్ అకాడమీ అద్భుత క్రీడాకారిణి గొడ్డటి వర్షిత అండర్-12 రాపిడ్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో ఘన విజయం సాధించి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విషయం విదితమే. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు వర్షితను ప్రత్యేకంగా కలిసి, శాలువా



కప్పి ఘనంగా సత్కరించారు .ఈ సమావేశంలో హరీష్ రావు వర్షిత అసాధారణ చదరంగ ప్రతిభను ఎంతో అభినందించారు. ఇంతటి ఘన విజయానికి కారకులైన కరీంనగర్ విశ్వనాథ్ చెస్ అకాడమీ కోచ్‌లు విశ్వనాథ్ ప్రసాద్, కొపర్తి శివయ్య ల నిరంతర శిక్షణను పర్యవేక్షణను ఆయన ప్రత్యేకంగా కొనియాడారు. క్రీడాకారుల ఎదుగుదలలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొంటూ, వర్షిత తండ్రి గొడ్డటి శ్రీనివాస్ ని కూడా ఈ సందర్భంగా హరీష్ రావు అభినందించారు. జాతీయ వేదికపై తెలంగాణ రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించబోతున్న వర్షితను మాజీ మంత్రి హరీష్ రావు ఆశీర్వదించి, సత్కరించారు. జాతీయ స్థాయికి ఎంపికై, ప్రముఖుల అభినందనలు అందుకున్న గొడ్డటి వర్షిత రాబోయే నేషనల్స్ పోటీల్లో కూడా విజయం సాధించాలని అకాడమీ వర్గాలు, క్రీడాభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

## ఖని మున్సిపల్ కార్యాలయంలో యాంటీ నార్కోటిక్స్ వింగ్ ఆకస్మిక తనిఖీలు



**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని జూన్ 16:**
రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న మున్సిపల్ కార్యాలయం, పార్కింగ్ ప్రాంతంలో గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్ర సేనారెడ్డి, అఫ్జాలొద్దిన్, ఎస్ఐ మనోహర్ లతో పాటు నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ సమన్వయంతో ఈ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయ ప్రాంగణం, పార్కింగ్ ప్రాంతం, సందర్శకుల సామగ్రి, పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా, నిల్వ, వినియోగాన్ని అరికట్టే లక్ష్యంతో ఈ తనిఖీలు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. ప్రజలు మత్తు పదార్థాలకు సంబంధించిన ఏదైనా సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేసి సహకరించాలని కోరారు.

## రొయ్యల ఫీడ్ ధరలు పెంచేది లేదు అనుమతి లేకుండా పెంచితే కఠిన చర్యలు

అనుమతి లేకుండా ఫీడ్ ధరలు పెంచితే ఊరుకునేది లేదని ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు హెచ్చరించారు. అనుమతి లేకుండా ఫీడ్ ధరలు పెంచడాన్ని నిలిపివేశామని స్పష్టం చేశారు. మంగళవారం పార్వతీపురం మన్యం జిల్లాలో పర్యటించి, పలు కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడారు. ప్రతి చిన్న అంశాన్ని రాజకీయం చేయడం గొడ్డలి పార్టీ అధ్యక్షుడు జగన్ రెడ్డి నైజమని మంత్రి అచ్చెన్నాయుడు ఎద్దేవా చేశారు. వైసీపీ హయాంలో విద్యుత్ సబ్సిడీ కేవలం రూ.750 కోట్లు ఇచ్చారని అన్నారు. కూటమి ప్రభుత్వం రొయ్యల రైతులకు ఏడాదికి రూ.1,170 కోట్ల విద్యుత్ సబ్సిడీ ఇస్తుందని స్పష్టం చేశారు. సోయాబీన్, ఫిష్ ఆయిల్ ధరలు పెరిగిన మాట వాస్తవమేనని చెప్పుకొచ్చారు. ముడి పదార్థాల ధరల భారం రైతులపై ఒక్కసారిగా మోపడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం, అధికారులు, రైతులు, తయారీదారులతో కూడిన కమిటీ ద్వారానే ఇకపై ధరల నిర్ణయం ఉంటుందని పేర్కొన్నారు.రొయ్యల రైతుల ప్రయోజనాల పరిరక్షణెళి తమ ప్రభుత్వ లక్ష్యమని వ్యాఖ్యానించారు.

## త్యాగమే చిరస్మరణీయం.. స్వర్గీయ పోల్నెని రవీందర్ రావుకు ఘన నివాళి

వర్ధంతి సందర్భంగా జమ్మికుంటలో బీజేపీ నాయకుల శ్రద్ధాంజలి
ఆయన ఆశయాల సాధనకు కృషి చేస్తామని నాయకుల ప్రతిజ్ఞ

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, జూన్ 16:**
జమ్మికుంట ప్రాంతంలో భారతీయ జనతా పార్టీ బలోపేతానికి విశేష కృషి చేసిన స్వర్గీయ పోల్నెని రవీందర్ రావు వర్ధంతి సందర్భంగా పట్టణ బీజేపీ అధ్యక్షుడు కొలకాని రాజు ఆధ్వర్యంలో ఘన నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు రవీందర్ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా నిర్వహించిన స్మరణ సభలో పలువురు నాయకులు మాట్లాడుతూ, 1997లో జమ్మికుంట మండల బీజేపీ అధ్యక్షుడిగా పనిచేసిన పోల్నెని రవీందర్ రావు పార్టీ విస్తరణకు, సిద్ధాంతాల ప్రచారానికి విశేషంగా కృషి చేశారని గుర్తు చేశారు. పార్టీ బలోపేతం కోసం గ్రామ గ్రామాన తిరుగుతూ కార్యకర్తలను సమీకరించి ప్రజల్లో జాతీయ భావజాలాన్ని పెంపొందించడంలో ఆయన కీలక పాత్ర పోషించారని కొనియాడారు.నాయకులు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా అయోధ్య రామమందిర నిర్మాణానికి మద్దతుగా సీనియర్ నాయకుడు ఎల్.కే. అద్వానీ చేపట్టిన రథయాత్ర సందర్భంగా జమ్మికుంట డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన కార్యక్రమాలను విజయవంతం చేయడంలో రవీందర్ రావు విశేష కృషి చేశారని తెలిపారు. ప్రజా ఉద్యమాలు, పార్టీ కార్యక్రమాల ద్వారా ఆయన బీజేపీని




గ్రామీణ స్థాయిలో బలోపేతం చేశారని పేర్కొన్నారు.పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసిన రవీందర్ రావుపై తీవ్రవాద శక్తులు బెదిరింపులకు పాల్పడినప్పటికీ ఆయన వెనుకడుగు వేయలేదని నాయకులు స్మరించారు. తన నమ్మిన సిద్ధాంతాల కోసం చివరి వరకు పోరాడిన నాయకుడిగా ఆయన చరిత్రలో నిలిచిపోయారని తెలిపారు.1997 జూన్ 15న జరిగిన విషాద ఘటనలో రవీందర్ రావు ప్రాణాలు కోల్పోయినా, ఆయన ఆశయాలు, సేవలు చిరస్థాయిగా నిలిచాయని పేర్కొన్నారు. వ్యక్తులు మరణించినా వారి ఆలోచనలు, సమాజం కోసం చేసిన సేవలు శాశ్వతంగా ప్రజల మనసుల్లో నిలిచిపోతాయని అన్నారు.జమ్మికుంట గడ్డ నుంచి స్వర్గీయ పోల్నెని రవీందర్ రావుతో పాటు సమ్మిరెడ్డి వంటి నాయకులు దేశం కోసం తమ జీవితాలను అంకితం చేశారని నాయకులు గుర్తుచేశారు. ఎందరో కార్యకర్తల త్యాగాలు, కృషి ఫలితంగానే నేడు భారతీయ జనతా పార్టీ కేంద్రంతో పాటు పలు రాష్ట్రాల్లో అధికారంలో ఉందని పేర్కొన్నారు.రవీందర్ రావు త్యాగస్ఫూర్తి నేటి యువతకు ఆదర్శమని, పార్టీ కార్యకర్తలు ఆయన చూపిన మార్గంలో నడుస్తూ సమాజ సేవకు అంకితమవాలని పిలుపునిచ్చారు. ఆయన ఆశయ సాధనే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.ఈ సందర్భంగా పట్టణ బీజేపీ అధ్యక్షుడు కొలకాని రాజు మాట్లాడుతూ, స్వర్గీయ పోల్నెని రవీందర్ రావు పార్టీ కోసం చేసిన సేవలను కార్యకర్తలు ఎప్పటికీ మరువరని అన్నారు.ం ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు బీజేపీ శ్రేణులు నిరంతరం కృషి చేస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శీలం శ్రీనివాస్, ఆకుల రాజేందర్, జీడి మల్లేష్, టంగుటూరి రాజ్‌కుమార్, రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యులు రాజేష్ ఠాకూర్, జిల్లా మరియు పట్టణ పదాధికారులు, బూత్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.కార్యక్రమం ముగింపులో నాయకులు స్వర్గీయ పోల్నెని రవీందర్ రావు సేవలను స్మరించుకుంటూ ఆయన ఆశయ సాధనకు కట్టుబడి పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఆయన త్యాగం జమ్మికుంట ప్రాంత రాజకీయ చరిత్రలో చిరస్మరణీయమని పేర్కొన్నారు.

## గాయత్రి యజ్ఞంతో శ్రీ సరస్వతి శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ప్రారంభం

చదువుతో పాటు సంస్కారం, విజ్ఞానాన్ని అందించే విద్యాలయాలు శిశు మందిరాలు
చిన్నారులకు పూలతో స్వాగతం పలికిన ఆచార్యులు, కమిటీ సభ్యులు

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, జూన్ 16:**
నూతన విద్యా సంవత్సరం ప్రారంభోత్సవ సందర్భంగా జమ్మికుంట పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో మంగళవారం గాయత్రి యజ్ఞాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రారంభ వేడుకల్లో భాగంగా చిన్నారులను ఆహ్వానిస్తూ ఆచార్యులు, కమిటీ సభ్యులు పూలతో స్వాగతం పలికారు.వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ నిర్వహించిన గాయత్రి యజ్ఞంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థుల్లో ఆధ్యాత్మికత, సంస్కారం, దేశభక్తి విలువలను పెంపొందించడమే లక్ష్యంగా శిశు మందిర్ విద్యాసంస్థలు





పనిచేస్తున్నాయని నిర్వాహకులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ, శిశు మందిరాలు కేవలం పాఠ్య విద్యనే కాకుండా సంస్కారం, నైతిక విలువలు, సమాజ సేవా భావనలను కూడా విద్యార్థుల్లో పెంపొందిస్తున్నాయని అన్నారు. విద్యార్థుల సమగ్ర వికాసానికి ఇటువంటి విద్యాసంస్థలు దోహదపడుతున్నాయని తెలిపారు.కార్యక్రమంలో శ్రీ సరస్వతి విద్యాపీఠం పెద్దలు బూర్ల దక్షిణామూర్తి, పాక సత్యనారాయణ, సరస్వతీ విద్యాపీఠ జిల్లా కార్యదర్శి తేళ్ల రాజమౌళి, సమితి కార్యదర్శి ఆకుల రాజేందర్, ప్రబంధకారిణి అధ్యక్ష కార్యదర్శులు శీలం శ్రీనివాస్, దాసరి రవీందర్, బుర్ర శివయ్య, బాదం రమేష్, ప్రధానాచార్యులు గుడికందుల సుదర్శన్, ఆచార్యులు టంగుటూరి రాజకుమార్తో పాటు విద్యాభిమానులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా చిన్నారులు కొత్త విద్యా సంవత్సరాన్ని ఉత్సాహంగా ప్రారంభించగా, తల్లిదండ్రులు, విద్యాభిమానులు వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షిస్తూ యజ్ఞం విజయవంతంగా ముగిసింది.

## లోక్ అదాలత్ ద్వారా వివాదాలకు శాశ్వత పరిష్కారం






జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. నీరజ

**కరపత్రం ప్రతినిధి రాజన్న సిరిసిల్ల**
లోక్ అదాలత్ ద్వారా వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, కోర్టు కేసుల్లో ఇరుపక్షాలు రాజీ మార్గాన్ని ఎంచుకోవడం వల్ల సమయం, ధనం ఆదా కావడంతో పాటు త్వరితగతిన న్యాయం అందుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు పి. నీరజ అన్నారు.మంగళవారం జిల్లా కోర్టు సముదాయంలో సిరిసిల్ల, వేములవాడ బార్ అసోసియేషన్ న్యాయవాదులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆమె పాల్గొన్నారు.అనంతరం ఆమె మాట్లాడుతూ కేసులు పరస్పర అంగీకారంతో పరిష్కారమవడం ద్వారా ప్రజలు దీర్ఘకాలిక న్యాయ ప్రక్రియల నుంచి విముక్తి పొందుతారని పేర్కొన్నారు. లోక్ అదాలత్‌ల ద్వారా వివాదాలు సత్వరమే పరిష్కారమై, న్యాయవ్యవస్థపై భారం కూడా తగ్గుతుందని తెలిపారు. రానున్న లోక్ అదాలత్‌లో మరిన్ని కేసులను పరిష్కారానికి పంపించేందుకు బార్ అసోసియేషన్ సభ్యులు సహకరించాలని ఆమె కోరారు. దీనికి స్పందించిన బార్ అసోసియేషన్ ప్రతినిధులు, లోక్ అదాలత్ విజయవంతానికి తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి బి. పుష్పలత, పోక్సో కోర్టు న్యాయమూర్తి రాధిక జైస్వాల్, సీనియర్ సివిల్ జడ్జి పి. లక్ష్మణాచారి, జూనియర్ సివిల్ జడ్జి కుమారి మేఘన, సిరిసిల్ల, వేములవాడ బార్ అసోసియేషన్ల అధ్యక్షులు ఆవునూరి రమాకాంతరావు, పిట్టల మనోహర్‌తో పాటు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## అమ్మ మాట -- అంగన్‌వాడి బడిబాట కార్యక్రమం ఘనంగా నిర్వహణ

చిన్నారుల విద్యాభివృద్ధికి అంగన్‌వాడి కేంద్రాలు కీలకం : కౌన్సిలర్ పొనగంటి విష్ణువర్ధన్

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, జూన్ 16:**
కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని మోతుగూడెం గ్రామంలో "అమ్మ మాట -- అంగన్‌వాడి బడిబాట" కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. చిన్నారుల్లో ప్రాథమిక విద్యపై ఆసక్తి పెంపొందించడం, అంగన్‌వాడి కేంద్రాల్లో నమోదు సంఖ్యను పెంచడం, తల్లిదండ్రుల్లో విద్యా ప్రాధాన్యతపై అవగాహన కల్పించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 11వ వార్డు కౌన్సిలర్ పొనగంటి విష్ణువర్ధన్ ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజ అభివృద్ధికి విద్యే మూలాధారమని, ప్రతి చిన్నారి విద్యను అభ్యసించేలా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. చిన్నారుల భవిష్యత్తుకు అంగన్‌వాడి కేంద్రాలు తొలి మెట్టులాంటివని పేర్కొన్నారు.అంగన్‌వాడి కేంద్రాల్లో పిల్లలకు పోషకాహారం, ప్రాథమిక విద్య, ఆరోగ్య సంరక్షణ, ఆటల ద్వారా నేర్పే విద్యా విధానం వంటి అనేక సేవలు




అందుతున్నాయని తెలిపారు. బాల్యంలోనే సరైన విద్య, పోషకాహారం అందించడం ద్వారా పిల్లలు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఎదుగుతారని వివరించారు."అమ్మ మాట -- అంగన్‌వాడి బడిబాట" కార్యక్రమం ద్వారా తల్లిదండ్రులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అంగన్‌వాడి సేవల ప్రాధాన్యత, పిల్లల విద్యలో వారి పాత్ర వంటి అంశాలపై అవగాహన కల్పించారు. చిన్నారులను సమయానికి అంగన్‌వాడి కేంద్రాలకు పంపించి, వారి భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత తల్లిదండ్రులపై ఉందని పేర్కొన్నారు.కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని చిన్నారులు, వారి తల్లిదండ్రులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్య ప్రాముఖ్యతను తెలియజేస్తూ నినాదాలు చేశారు. అంగన్‌వాడి కేంద్రాల్లో అందుతున్న సేవలను ప్రజలకు వివరించారు. చిన్నారుల హాజరు పెంపుతో పాటు పాఠశాలల్లో చేరికలు అధికంగా ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులు సూచించారు.అంగన్‌వాడి సిబ్బంది మాట్లాడుతూ, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి చిన్నారిని అంగన్‌వాడి సేవల పరిధిలోకి తీసుకురావడమే తమ ప్రధాన బాధ్యత అని తెలిపారు. బాలల సమగ్రాభివృద్ధికి అంగన్‌వాడి కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ పొనగంటి విష్ణువర్ధన్ అంగన్‌వాడి కేంద్రాన్ని సందర్శించి అక్కడి సౌకర్యాలను పరిశీలించారు. చిన్నారులతో మమేకమై వారి ఆరోగ్యం, విద్యాభ్యాసంపై ఆరా తీశారు. తల్లిదండ్రులు పిల్లల విద్య విషయంలో నిర్లక్ష్యం చేయకుండా, ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు, సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళలు, చిన్నారులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.